క్లుప్తంగా

భూసార పరీక్షలు తప్పనిసరి

నింద్ర: మండలంలోని రైతులు తమ పొలంలో భూసార పరీక్షలు చేసుకుని ఫలితాల ఆధారంగా ఎరువులు వాడాలని వ్యవసాయాధికారి తులసీరాం తెలిపారు. ఆయన బుధవారం నింద్రలోని వ్యవసాయ కార్యాలయంలో పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. అందులోని లోపాలను గుర్తించి కావలసిన పోషకాలను వాడాలన్నారు. అప్పుడే పంటల్లో అధిక దిగుబడి సాధించవచ్చని వివరించారు. ప్రకృతి వ్యవసాయం, ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు.

సప్తగిరి బ్యాంకులో ప్రమాద బీమా

గంగవరం: సప్తగిరి గ్రామీణ బ్యాంకు అందించే బీమా సదుపాయాన్ని ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని బ్రాంచ్ మేనేజర్ కృపానంద్ తెలిపారు. 18 నుంచి 70 ఏళ్లలోపు వారు ఏడాదికి రూ.20ల ప్రీమియం, అలాగే 18 నుంచి 50 ఏళ్లలోపు వారు ఏడాదికి రూ.436 ప్రీమియం చెల్లిస్తే రెండు ఇన్సూరెన్స్ పాలసీలకు విడివిడిగా రూ.2 లక్షల వరకూ ప్రమాద బీమా అందజేస్తామన్నారు. ఈ సదవకాశాన్ని ఖాతాదారులు వినియోగించుకోవాలని ఆయన కోరారు. అదే విధంగా బంగారు రుణాలపై గ్రాముకి రూ.6800 వరకూ ఇస్తామని తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

పూలే సేన రాష్ట్ర అధ్యక్షుడిగా బాలసుబ్రమణ్యం



పలమనేరు: మహాత్మా పూలే సేన రాష్ట్ర అధ్యక్షుడిగా పలమనేరు పట్టణానికి చెందిన బాలసుబ్రమణ్యం నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు నాగేశ్వరావు బుధవారం నియామక ఉత్తర్వులు పంపించారు. బాలసుబ్రమణ్యం గతంలో పూలే సేనలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని బీసీల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

ఆన్‌కాల్ డ్రైవర్లకు అవకాశం

పలమనేరు: పలమనేరు ఆర్టీసీ డిపోలో ఆన్‌కాల్ డ్రైవర్లుగా పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డీఎం టీకేస్వామి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన వారు అసిస్టెంట్ మేనేజర్‌ను కలవాలని సూచించారు.

శ్మశానవాటిక ఏర్పాటుచేయాలని వినతి



మాట్లాడుతున్న ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి

రొంపిచెర్ల: తమ గ్రామంలో ఎవరైనా చనిపోతే అంత్యక్రియలు చేయడానికి శ్మశానవాటిక ఏర్పాటుచేయాలని మోటుమల్లెల పంచాయతీ నగిరి దళితవాడ వాసులు కోరారు. తహసీల్దార్ అమర్‌నాథ్‌ను బుధవారం నగిరి దళితవాడలో ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. దళితులు మాట్లాడుతూ గ్రామంలో ఎవరైన మృతి చెందితే పూడ్చడానికి భూమి లేని వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ భూమిని కేటాయించాలని కోరారు. అలాగే గ్రామంలో మురుగు కాలువలు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో ఎక్కడపడితే అక్కడ పేడ దిబ్బలు వేశారని, వీటి వల్ల రోగాలు వస్తాయన్నారు. మురుగు కాలువలు, శ్మశానం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శివకుమార్, వీఆర్వో దామోదర్, హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

పుంగనూరు: మండలంలోని బసివినాయునిపల్లెలో బుధవారం ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. బసివినాయునిపల్లెకి చెందిన వెంకటరమణ కుమారుడు రెడ్డెప్ప(35) కొద్ది రోజులుగా ఆర్థికంగా ఇబ్బందులతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో వున్న అతన్ని కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు మదనపల్లెకు రెఫర్ చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మానవ అక్రమ రవాణాపై అవగాహన



పోస్టర్లు విడుదల చేస్తున్న శ్రావణి, ఎస్‌ఐ వెంకటరమణ

పుంగనూరు: మానవ అక్రమ రవాణాపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి వుండాలని జన చైతన్య సంస్థ అధ్యక్షురాలు శ్రావణి తెలిపారు. ఆమె బుధవారం స్థానిక పోలీసు స్టేషన్ ఆవరణలో ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవ పోస్టర్లు విడుదల చేశారు. ఎస్‌ఐ వెంకటరమణ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా నిరోధంలో న్యాయ, పోలీసు వ్యవస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు.

నానో యూరియాతో లాభాలు

పంటల సాగులో సూక్ష్మ పోషకాల ప్రాముఖ్యత ఎంతో వుంటుంది. ముఖ్యంగా యూరియా లేనిదే రైతులు పంటలను సాగు చేయడం లేదు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో పలు పంటలకు యూరియా అవసరం ఎక్కువైంది. ఈ క్రమంలో కొంతమంది వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. ఫలితంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా వినియోగించాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. అది కూడా సాధారణ యూరియాలాగే పనిచేస్తుందని, పంటలపై వెదజల్లడమూ సులభమని చెబుతున్నారు.

- సాధారణ యూరియాలాగే పనిచేస్తుంది
- పంటల్లోవెదజల్లడమూ సులభం
- భూసార పరీక్షల ఆధారంగానే ఎరువులు



పంటకు సూక్ష్మ పోషక ఎరువులను చల్లుతున్న రైతు



నానో యూరియా బాటిళ్లు

పలమనేరు: పలమనేరు వ్యవసాయశాఖ డివిజన్‌లో ఖరీఫ్‌లో వేరుశనగ ప్రధాన పంటగా సాగు చేస్తారు. ఇది 14 వేల హెక్టార్లలో సాగవుతుంది. తర్వాత సుమారు 5 వేల హెక్టార్లలో వరి, 6 వేల హెక్టార్లలో అన్ని రకాల కూరగాయలు పండిస్తారు. ఈ ఏడాది సరైన సమయంలో వర్షాలు కురకపోవడంతో 50 హెక్టార్లలో మాత్రమే వేరుశనగ వేశారు. ప్రస్తుతం నీటి వసతి ఉన్న రైతులు వరిసాగుపై ఆసక్తి చూపుతున్నారు. వరినార్లు పోసుకుని పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. కొన్ని గ్రామాల్లో వరినాట్లతో రైతులు, కూలీలు బిజీగా మారారు. ఈ సీజన్‌లో 3 వేల హెక్టార్లలో వరిసాగయ్యే అవకాశం ఉందని పలమనేరు వ్యవసాయ అధికారులు తెలిపారు. ఈ క్రమంలో యూరియాకు డిమాండ్ పెరిగింది. దీన్ని ఆసరాగా తీసుకున్న వ్యాపారులు కృత్రియ యూరియా కొరత సృష్టించి బస్తా యూరియా రూ.300లకు పైగా విక్రయిస్తున్నారు. అది కూడా ప్రస్తుతం దొరకడం లేదు. దుకాణాలకు సరఫరా అవుతున్న యూరియా అదే రోజు ఖాళీ అవుతోంది. ఇక్కడి రైతులు సాధారణ పంటలకంటే పశుగ్రాసానికి ఎక్కువగా యూరియాను వినియోగించడమే డిమాండ్‌కు కారణంగా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో యూరియాకు బదులు నానో యూరియా వాడాలని అధికారులు చెబుతున్నారు.

నానో ఎరువులు మేలు

యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో ఎరువులు వేయడం ఎంతో మేలు. వీటితో భూమి కాలుష్యం ఉండదు. బస్తా యూరియాకు బదులు 500 ఎంఎల్ నానో యూరియా సరిపోతుంది. సాధారణ యూరియా బస్తాలను రవాణా చేయడం కష్టమే. నానో బాటిల్ జేబులో పెట్టుకొని వెళ్లవచ్చు. సాధారణ యూరియాలా నానోలో వృథా అసలుండదు. జింక్ సల్ఫేట్, కాంప్లెక్స్, డీఏపీలతో కలిపి దీన్ని వాడుకోవచ్చు.

పంటల సాగులో సూక్ష్మధాతు పోషకాల పాత్ర

మొక్క ఎదుగుదల, ఇతర పోషకాల సమర్థ వినియోగానికి జింకు సల్ఫేట్ ఎంతగానో ఉపయోగపడుతుంది. జింకు లోపిస్తే ఆకుల ఈనెల మధ్య భాగం పసుపు రంగులోకి మారి ఆకులు చిన్నవిగా అవుతాయి. దీని నివారణకు ఎకరాకు 20 కిలోల జింకు సల్ఫేట్‌ను దుక్కిలో చల్లుకోవాలి. భాస్వరం ఎరువుతో కలిపి దీన్ని వాడరాదు. మొక్కలు పూత దశలో వున్నప్పుడు సంపర్కం, ఫలదీకరణలో బోరాన్ కీలక పాత్ర వహిస్తుంది. ఇది లోపిస్తే ఆకులు కురచబడి, కొనలు నొక్కుకుపోయినట్లయి, పెళుసు బారతాయి. ఇందుకోసం ఎకరాకు కిలో బోరాక్స్‌ను ఆఖరి దుక్కిలో వేసుకోవాలి. జిప్సం ఎరువులో క్యాల్షియం, గంధకం ధాతువులు ఉంటాయి. ఇవి నూనె గింజల్లో మాంసపుకృత్తులు, నూనె శాతం పెరగడానికి ఉపయోగపడుతాయి. జిప్సం లోపాన్ని నివారణకు ఎకరా పొలానికి రెండు వందల కిలోల జిప్సంను చివరి దుక్కిలో వేయాలి.

నానో ఎరువులపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం



ఈ మధ్య వరినాటిన రైతులు ఇష్టానుసారంగా యూరియాను వాడుతున్నారు. దీంతో మొక్క ఏపుగా పెరగడంతో క్రిమికీటకాల తాకిడి ఎక్కువై తెగుళ్ల సోకుతాయి. భూమి కలుషితమై సారాన్ని కోల్పోయి ఎందుకూ పనికి రాకుండా పోతుంది. ఎకరా వరిపొలానికి అవసరాన్ని బట్టి పంట మొత్తం కాలంలో రెండు బస్తాల యూరియా చాలు. కొందరు రైతులు దీనిపై అవగాహన లేక విపరీతంగా వాడుతున్నారు. దీనికి బదులు నానో యూరియా వాడుకోవడం చాలామంచిది. దీనిపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఎరువుల దుకాణాల్లో సైతం నానో ఎరువులు అందుబాటులో ఉన్నాయి. – సంధ్య, ఏవో, పలమనేరు

నోటీస్ బోర్డు

- **నేడు బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ**

చౌడేపల్లె: మండలంలోని పెద్దయల్లకుంట్ల, కొండయ్యగారిపల్లె, 29 ఏచింతమాకులపల్లె, పుదిపట్ల పంచాయతీల్లో గురువారం బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు జి.నాగభూషణరెడ్డి తెలిపారు. గ్రామస్థాయి కమిటీ ఏర్పాటు చేస్తామన్నారు.

- **నేడు ఉచిత వైద్య శిబిరం**

వి.కోట: ప్రభుత్వాస్పత్రిలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్టు లయన్స్ క్లబ్ మండల అధ్యక్షుడు డాక్టర్ తమీమ్ తెలిపారు. బెంగళూరు వైదేహి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు గుండె పరీక్ష, నాడీ వ్యవస్థ, క్యాన్సర్, తదితర పరీక్షలు చేస్తారని తెలిపారు. అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని వెల్లడించారు.

- **ఆగస్టు 6న జాబ్‌మేళా**

పుంగనూరు: పట్టణంలోని శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆగస్టు 6న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. ఇందులో కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలకు ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

పాఠశాల స్థలం ఆక్రమణపై ఫిర్యాదు



పెద్దపంజాణి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల స్థలం ఆక్రమణకు గురైందని గ్రామస్తులు బుధవారం ఇన్‌చార్జి తహసీల్దార్ రమేష్ బాబుకు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ 30 ఏళ్ల క్రితం తాము పాఠశాల కోసం 5 ఎకరాలను సేకరించి జిల్లా కలెక్టర్, డీఈవో పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించామన్నారు. గ్రామానికి చెందిన వ్యక్తి తప్పుడు రికార్డులతో ఐదుగురికి ఇంటి జాగాలు విక్రయించాడన్నారు. అతనిపై చర్యలు తీసుకుని పాఠశాల స్థలాన్ని కాపాడాలని కోరారు. ఇంటి స్థలాలు కొన్నవారు తాము మోసపోయామని పోలీసులను ఆశ్రయించారు.

ఆటో ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

పుంగనూరు: పట్టణంలోని శాంతినగర్‌లో బుధవారం ఆటో ఢీకొనడంతో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. శాంతినగర్‌కు చెందిన నారాయణ (45) నడుచుకుంటూ ఇంటికి వెళుతున్నాడు. అదే మార్గంలో అతివేగంగా వచ్చిన ఆటో అతన్ని ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతన్ని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు మదనపల్లెకు రెఫర్ చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిల్వ మాంసాన్ని విక్రయించరాదు

పలమనేరు: నిల్వ ఉంచిన మాంసాన్ని విక్రయించరాదని, షాపుల వద్ద పరిశుభ్రతను పాటించాలని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. ఆయన బుధవారం మటన్, చికెన్ దుకాణాల వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో ఉన్న మేకలు, పొట్టేళ్లను తెచ్చి విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. కొన్ని చికెన్ దుకాణాల వద్ద పరిసరాలు అధ్వానంగా ఉన్నాయని, మార్చుకోవా లని సూచించారు. తమ తనిఖీల్లో పరిస్థితులు అధ్వానంగా వున్నట్టు గుర్తిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

కార్యకర్తలకు భరోసా ఇవ్వండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ యువరాజ్

వి.కోట: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయడంతోపాటు కార్యకర్తలకు భరోసా ఇవ్వాలని పార్టీ మండల కన్వీనర్, ఎంపీపీ యువరాజ్ పిలుపునిచ్చారు. ఆయన బుధవారం మండల కన్వీనర్ యువరాజ్ ఆధ్వర్యంలో పాముగానిపల్లి, ముదరందొడ్డి, బైరుపల్లి పంచాయతీల్లో పార్టీ నాయకులు, శ్రేణులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు గ్రామాల్లో కీలకంగా పనిచేయాలన్నారు. ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు డాక్టర్ తమీమ్, లక్ష్మన్ రెడ్డి, మండల యువత అధ్యక్షుడు పవన్‌కుమార్, కుమార్‌రాజా, కృష్ణ, రైతు విభాగం అధ్యక్షుడు రాధాకృష్ణారెడ్డి, జిల్లా బూత్ కమిటీ సెక్రటరీ మణి, ఎస్సీ సెల్ శివరాం, మండల ఉపాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, సోషల్ మీడియా శివ పాల్గొన్నారు.

వెలుగు కార్యాలయ స్థలం ఆక్రమణపై ఆగ్రహం



ప్రభుత్వ స్థలంలో పశువుల షెడ్డు ఏర్పాటు చేసిన టీడీపీ నాయకుడు

గంగవరం: మండలంలోని కీలపట్లలో వెలుగు కార్యాలయ భవన నిర్మాణం కోసం కేటాయించిన స్థలాన్ని టీడీపీ నాయకుడు ఆక్రమించి పశువుల కొట్టం ఏర్పాటు చేసుకున్నాడు. దీనిపై గ్రామస్తులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. వారు పట్టించుకోకపోవడంతో బుధవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామస్తుల కథనం మేరకు.. కీలపట్లలో ప్రభుత్వ పశువైద్యశాలకు ఆనుకుని కొంత ప్రభుత్వ స్థలాన్ని వెలుగు కార్యాలయ భవన నిర్మాణం కోసం గత ప్రభుత్వ హయాంలో అధికారులు కేటాయించారు. ప్రభుత్వ ఉత్తర్వులు వచ్చినా భవన నిర్మాణం చేపట్టలేదు. దీన్ని అదునుగా తీసుకున్న అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు పయని ఆ స్థలాన్ని ఆక్రమించుకుని పశువుల కొట్టం ఏర్పాటు చేసుకున్నాడు. ఈ విషయాన్ని స్థానిక సర్పంచ్, రెవెన్యూ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. ఆక్రమణదారుడు టీడీపీ నాయకుడు కావడంతో చర్యలు తీసుకోవడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరిస్తున్నారు. దీనిపై తహసీల్దార్ రేఖ వివరణ ఇస్తూ భూమి ఆక్రమణ విషయం తన దృష్టికి రాలేదన్నారు. దాన్ని పరిశీలించి స్థలం ఆక్రమణకు గురైనట్టు తేలితే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

చెరువుల్లో ఆక్రమణలు తొలగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఐ షెక్షావలి

సదుం: మండలంలోని కంభంవారిపల్లె పంచాయతీలోని పలు చెరువులు, కుంటలు ఆక్రమణకు గురయ్యాయని, వాటిని తొలగించాలని గ్రామస్తులు కోరారు. గాండ్లపల్లె ఎస్సీ కాలనీలో బుధవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. స్థానికులు మాట్లాడుతూ చెరువులు నిండితే ఆక్రమణల కారణంగా పట్టా భూముల్లోకి నీరు వస్తోందని తెలిపారు. అర్హులందరికీ ఉపాధి పనులు కల్పించాలని కోరారు. అలాగే శ్మశానవాటికల ఆక్రమణలు తొలగించాలన్నారు. కాలనీలో ఐదేళ్ల క్రితం విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసినా ఇంత వరకు కేబుళ్లు లాగలేదని తెలిపారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని డీటీ కిశోర్ హామీ ఇచ్చారు. ఎస్‌ఐ షెక్షావలి మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు కలిసి మెలసి జీవించాలని, వివాదాల జోలికి వెళ్లవద్దన్నారు. కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూవో షరీఫ్, సర్పంచ్ దీప, సీతాపతి తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా మార్కెట్ యార్డు



పెద్దపంజాణి: మండలంలోని రాయలపేటలో 1982–83లో పుంగనూరు మార్కెట్ కమిటీకి అనుబంధంగా సబ్–మార్కెట్ యార్డును ఏర్పాటు చేశారు. ఇందుకోసం అప్పట్లోనే సుమారు 11 ఎకరాల భూమిని మార్కెట్ కమిటీకి అప్పగించారు. అందులో రూ.లక్షలు వెచ్చించి గోదాము, రెండు ప్లాట్ ఫారాలు, వాచ్‌మెన్ క్వార్టర్లు నిర్మించారు. నిర్వహణ లోపంతో మార్కెట్ యార్డు నిరుపయోగంగా మారి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. అన్నదాతలు తమ ఉత్పత్తులను అమ్ముకోవడానికి ఇతర మార్కెట్లకు వెళ్లాల్సి వస్తోంది. అధికారులు స్పందించి మార్కెట్ యార్డును వినియోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

విద్యార్థులపై కూటమి ప్రభుత్వం చిన్నచూపు



చౌడేపల్లెలోని బీసీ బాలుర వసతి గృహంలో సమస్యలను తెలుసుకుంటున్న కళ్యాణ్‌భరత్

చౌడేపల్లె: పేద విద్యార్థులపై కూటమి ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని, ప్రభుత్వ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కళ్యాణ్‌భరత్ మండిపడ్డారు. ఆయన బుధవారం నాయకులతో కలిసి బీసీ, ఎస్సీ బాలుర వసతి గృహాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వసతి గృహాల్లో మరుగుదొడ్లు అధ్వానంగా వున్నాయన్నారు. లైట్లు, ఫ్యాన్లు పనిచేయడం లేదని, కిటికీలకున్న మెష్ చిరిగిపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయని తెలిపారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. బీసీ హాస్టల్‌కు దారి సౌకర్యం లేదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కాస్మోటిక్ చార్జీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నయవంచన చంద్రబాబు నైజం



ఏకొత్తకోటలో బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీలో క్యూఆర్‌కోడ్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు

చౌడేపల్లె : ఎన్నికల్లో హామీలు ఇవ్వడం, అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసం చేయడం సీఎం చంద్రబాబు నైజమని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.దామోదరరాజు, పార్టీ మండల అధ్యక్షుడు జి.నాగభూషణరెడ్డి, వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రుక్మిణమ్మ మండిపడ్డారు. వారు బుధవారం ఏ.కొత్తకోట, దుర్గసముద్రం, చారాల, శెట్టిపేట పంచాయతీల్లో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలుచేయలేక డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందన్నారు. ఇందులో భాగంగా వైఎస్సార్ సీపీ నేతలపై అక్రమ కేసులు పెడుతోందని ఆరోపించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదని చెప్పి హామీలను తుంగలో తొక్కుతోందని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని ప్రజలకు క్యూఆర్ కోడ్ ద్వారా వివరించాలని సూచించారు. కార్యక్రమంలో బోయకొండ ఆలయ మాజీ చైర్మన్ మిద్దింటి శంకర్ నారాయణ, పార్టీ మండల ఉపాధ్యక్షులు వెంకటరమణ, లడ్డూరమణ, కో ఆప్షన్ మెంబరు సాదిక్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సింగిల్‌విండో మాజీ చైర్మన్ రవిచంద్రారెడ్డి, సర్పంచ్ షంషీర్, ఓబుల్‌రెడ్డి, విజయకుమారి, సరస్వతమ్మ పాల్గొన్నారు.

నూతన వధూవరులకు పెద్దిరెడ్డి ఆశీర్వాదం



రొంపిచెర్ల : నూతన వధూవరులతో పెద్దిరెడ్డి

సదుం/రొంపిచెర్ల : మండలంలోని చెరుకువారిపల్లెకు చెందిన బ్రహ్మకుమార్ రెడ్డి వివాహం బుధవారం సాయంత్రం సదుంలో జరిగింది. అదేవిధంగా పులిచెర్ల మండలం 106 రామిరెడ్డిగారిపల్లె పంచాయతీ చెరువు ముందరపల్లెకు చెందిన అరవ వెంకటరమణ రెడ్డి కుమార్తె పూర్ణరెడ్డికి చిన్నగొట్టిగల్లు మండలం తిప్పిరెడ్డిగారిపల్లెకు చెందిన వై.వెంకటరమణారెడ్డి కుమారుడు మురళీధర్ రెడ్డి పెళ్లి బుధవారం రాత్రి రొంపిచెర్ల మండలం పెద్దగొట్టిగల్లు పంచాయతీలోని వీఎంఆర్ కల్యాణ మండపంలో జరిగింది. వివాహ వేడుకల్లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ తిమ్మారెడ్డి, పార్టీ ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు ప్రకాశ్‌రెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్, వైస్ సర్పంచ్ బాబురెడ్డి, భాస్కర్ రెడ్డి, మనోహర్ రెడ్డి, రమేశ్‌రెడ్డి, మనోజ్, వెంకటరెడ్డి, మస్తాన్, హనుమంత రెడ్డి, దామోదర్ రెడ్డి , పులిచెర్ల నాయకులు లోకనాథ రెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, నారాయణ రెడ్డి, చెంచు రెడ్డి, చంద్రారెడ్డి, శివారెడ్డి, అరుణ్‌కుమార్‌రెడ్డి, దామోదర్ రెడ్డి, రొంపిచెర్ల నాయకులు కరీముల్లా, మహబుబ్‌బాషా, ఐడియా కాలేషా, బావాజీ, మంజూర్, ఖలీల్, శ్రీకాంత్, నసీరుద్దీన్ తదితరులు వున్నారు.



సదుం : వివాహ వేడుకలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి

చంద్రబాబుది జనాన్ని ఏమార్చే పాలన



పలమనేరులో పర్యటిస్తున్న మాజీ ఎమ్మెల్యే

పలమనేరు: ఎన్నికలకు ముందు అలివిగాని హామీలిచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రబాబు జనాన్ని ఏమార్చేలా పరిపాలన చేస్తున్నారని పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ విమర్శించారు. ఆయన బుధవారం పట్టణంలో జరిగిన ఒక శుభకార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన పలమనేరులో పర్యటించారు. స్థానికులతో మాట్లాడారు. కూటమి పాలనలో ఇబ్బందులు పడుతున్న వారు త్వరలో వైఎస్సార్ సీపీ ఏర్పాటు చేసే యాప్‌లో వారి సమస్యలను నమోదు చేసుకోవాలని సూచించారు. వాటి పరిష్కారం కోసం కృషిచేస్తామన్నారు. కూటమి పాలనపై ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందని, త్వరలోనే మంచిరోజులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ హేమంత్‌కుమార్‌రెడ్డి, గంగవరం కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, నాగరాజు, శ్యామ్, సోము, రెడ్డెప్పరెడ్డి, బాబా తదితరులున్నారు.

బాలుర వసతి గృహం తనిఖీ



హాస్టల్ విద్యార్థులతో వైఎస్సార్ సీపీ నేతలు

శాంతిపురం: మండలంలోని దండికుప్పం వద్ద ఉన్న బాలుర హాస్టల్‌ను బుధవారం ఎంపీడీవో ఏపీఆర్ కుమార్ తనిఖీ చేశారు. విద్యార్థులకు వడ్డిస్తున్న ఆల్పాహారం నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మరమ్మతు పనులను పరిశీలించారు. 60 మంది విద్యార్థులకు అవసరమైన కొత్త దుప్పట్లను అందజేయాలని వార్డెన్ సుధాకర్‌కు సూచించారు. పంచాయతీ కార్యదర్శి రవినాయక్ ఉన్నారు. అదేవిధంగా వైఎస్సార్ సీపీ నాయకుడు, రెస్కో మాజీ చైర్మన్ చక్రపాణిరెడ్డి, నియోజకవర్గ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు నగేష్, మురుగేష్, ప్రసన్న, సురేష్ హాస్టల్‌ను తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

చెత్త సేకరణను సక్రమంగా చేపట్టాలి



బైరెడ్డిపల్లె ఎస్‌డబ్ల్యూపీసీని పరిశీలిస్తున్న జిల్లా కోఆర్డినేటర్ హరిప్రసాద్‌రెడ్డి

బైరెడ్డిపల్లె :గ్రామాల్లో చెత్త సేకరణ కార్యక్రమాన్ని బుధవారం డీపీఆర్సీ జిల్లా కో ఆర్డినేటర్ హరిప్రసాద్‌రెడ్డి తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సేకరించిన చెత్తను చెత్త సంపద కేంద్రాలకు తరలించి వర్మీకంపోస్టు ఎరువులు తయారు చేయాలన్నారు. అనంతరం బైరెడ్డిపల్లె ఎస్‌డబ్ల్యూపీసీని పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేంద్రబాలాజీ, డిప్యూటీ ఎంపీడీవో నాగార్జునరెడ్డి, మండల రిసోర్స్ కో ఆర్డినేటర్ సురేష్‌బాబు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంఘం కోఆర్డినేటర్‌గా వెంకటప్రసాద్‌శర్మ



పుంగనూరు: రాష్ట్ర బ్రాహ్మణ సంఘం కోఆర్డినేటర్‌గా పుంగనూరుకు చెందిన ఎస్ఆర్.వెంకటప్రసాద్‌శర్మ నియమితులయ్యారు. ఈ మేరకు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వేమూరి ఆనందసూర్య బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ఈ పదవిలో 2027 వరకు వుంటారు. బ్రాహ్మణ సమాజం అభివృద్ధిలో వెంకటప్రసాద్‌శర్మ సేవలు, సమాజం పట్ల ఉన్న నిబద్ధతను గుర్తించి ఈ బాధ్యతను అప్పగించినట్లు తెలిపారు. ఆయనకు పలువురు బ్రాహ్మణులు శుభాకాంక్షలు తెలిపారు.